షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 322 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 8 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 322 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 8 October 2024 PAGES : 8 PRICE : 5/-



## ఫలప్రదంగా చర్చలు

- మాల్దీవులు అధ్యక్షుడి యూటర్న్..
- భారత్‌కు రాగానే మారిన మాట తీరు
- త్వరలో మాల్దీవుల్లో ప్రధాని మోదీ పర్యటన
- ఇరు దేశాలకు చెందిన కొన్ని రంగాలలో ఆర్థిక సంబంధాలు, కనెక్టివిటీ, సాంస్కృతిక అనుసంధానం, సహకారాన్ని మెరుగుపరచడానికి గల మార్గాలను ఈ సమావేశంలో చర్చించాం"
- మాల్దీవుల్లో పర్యటించాల్సిందిగా మహమ్మద్ ముయిజ్జు ఆహ్వానాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అంగీకరించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి
- 10 నెలలుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడినట్లయింది
- గతంలో భారత ప్రధానిని, భారత్‌ని తక్కువ చేస్తూ మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపాయి.


# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

- ప్రధాని మోదీతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ
- వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలకు నిధుల కేటాయింపు చర్చించినట్లు సమాచారం.
- పలువురు కేంద్ర మంత్రు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్ , పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురితో కలువనున్న సీఎం చంద్రబాబు



ఢిల్లీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన రెండురోజుల పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి బయలుదేరిన చంద్రబాబుకు ఢిల్లీలో టీడీపీ ఎంపీలు స్వాగతం పలికారు. సెప్టెంబర్ మొదటివారంలో ఏపీని వణికించిన వర్షాలు, వరదల తరువాత ఏపీ సీఎం ఢిల్లీకి వెళ్లడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసి చంద్రబాబు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులపై చర్చించారు. ప్రధానం అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులతో పాటు వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలకు నిధుల కేటాయింపు చర్చించినట్లు సమాచారం. రెండ్రోజుల పర్యటనలో భాగంగా దేశ రాజధానిలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకుని ప్రధానితో భేటీ అయ్యారు. - మిగతా3లో




## ఏపీలో కొత్త జిల్లాలు.. ఆ రెండు జిల్లాలు రద్దు..

- గత వైసీపీ ప్రభుత్వం ఏపీలో 13గా జిల్లాల సంఖ్యను 26కు పెంచింది
- కొత్త జిల్లాల ఏర్పాటుతోపాటు ప్రస్తుతం ఉన్న జిల్లాల్లో మార్పులు చేయబోతున్నట్లు ప్రచారం
- కొత్తగా మరో నాలుగు జిల్లాను ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని 30 జిల్లాలుగా పునర్నిర్మాణం చేస్తారని సోషల్ మీడియాలో ఓ పోస్టు జోరుగా సర్కులేట్
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న డాక్యుమెంట్‌ను ఎవరూ నమ్మొద్దు
- ఈ జిల్లాల అంశంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం వెల్లడి

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి జిల్లాల పునర్విభజన చేయనున్నారా?. కొత్తగా జిల్లాలను ఏర్పాటు చేయనున్నారా?. ప్రస్తుతం ఉన్న జిల్లాలకు పేర్లను మార్చనున్నారా?.. ప్రస్తుతం ఇదే విషయమై జోరుగా చర్చ జరుగుతున్నది. గత వైసీపీ ప్రభుత్వం ఏపీలో 13గా జిల్లాల సంఖ్యను 26కు పెంచింది. అయితే అప్పుడే కొన్ని జిల్లాల ఏర్పాటుపై అభ్యంతరాలు - మిగతా3లో


## అందరి క్షేమం కోరే మనసున్న మంచి ప్రభుత్వం తమది



- పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తాం
- మారుమూల ప్రాంతాల్లో ఎటువంటి ఆదాయం లేని ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు ఇబ్బందిగా ఉంది
- ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం ధూప, దీప నైవేద్య సాయం తాజాగా రూ.10 వేలకు పెంచడం జరిగింది
- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

అమరావతి

యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఎటువంటి ఆదాయం లేని ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు ఇబ్బందిగా ఉందని బ్రాహ్మణులు పాదయాత్ర సందర్భంగా తన ద ృష్టికి తెచ్చారని, వారికి ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం ధూప, దీప నైవేద్య సాయం తాజాగా - మిగతా3లో



## వామపక్ష తీవ్రవాదంపై తుది సమరానికి సమయం ఆసన్నం

- దేశంలో వామపక్ష తీవ్రవాదం చివరి దశలో ఉంది
- 2026 మార్చి నాటికి దేశం ఆ సమస్య నుంచి విముక్తి కానున్నట్లు ఆయన వెల్లడి
- వామపక్ష తీవ్రవాద హింస వల్ల మరణించిన వారి సంఖ్య 100 కన్నా తక్కువకు పడిపోయింది
- ప్రస్తుతం 80 శాతం నక్సల్స్ కేడర్ చత్తీస్‌ఘడ్‌లో మాత్రమే ఉంది
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

## ధర్మవరం రూపు రేఖలను మార్చే హ్యాండ్లూమ్ క్లస్టర్

- ఏర్పాటుకు సత్వర చర్యలు
- కేంద్రానికి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వినతి
- ధర్మవరం సంప్రదాయ పట్టు చీరెల తయారీ రంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది
- అత్యుత్తమ నాణ్యతతో కూడిన చేనేత, పట్టు చీరెల తయారీ నిపుణులకు ధర్మవరం పుట్టినిల్లు



అమరావతి

సత్యసాయి జిల్లా ధర్మవరంలో "హ్యాండ్లూమ్ క్లస్టర్" ఏర్పాటుకు సత్వరం చర్యలు చేపట్టాలని కేంద్ర జౌళి, చేనేత శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ రాశారు. శతాబ్దాలుగా చేనేత రంగానికి ముఖ్యంగా పట్టుచీరెల ఉత్పత్తికి ఈ ప్రాంతం ప్రసిద్ధి గాంచిందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను లేఖకు జత చేసినట్లు - మిగతా3లో




## జేడీయూకి 20 సీట్లు కూడా రావు

- బీజేపీ, నితీశ్ కుమార్‌లు ఎన్నికల్లో ఓటమిని చవిచూడాల్సి ఉంటుంది
- నితీశ్ కుమార్ రాజకీయంగా భారంగా మారారు
- ఆయనతో ఏ పార్టీ పొత్తు పెట్టుకోదు
- ఒకవేళ పెట్టుకున్నా ఆ పార్టీ మునగడం ఖాయం
- జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు, నాయకుడు ప్రశాంత్ కిషోర్

# 2047 నాటికి వికసిత్ భారత్‌ను చూస్తాం

- సరిగ్గా 23 ఏళ్ల క్రితం ఇదే రోజున నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు
- విప్లవాత్మక నిర్ణయాలతో కోట్లాది మంది భారతీయుల జీవితాలను మార్చడం ఆ రోజుతోనే మొదలైంది
- ఆయన నాయకత్వంలో మన దేశం విశ్వవ్యాప్తంగా కీర్తిని పొంది.. అన్ని రంగాల్లో దూసుకెళ్తుంది
- త్వరలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



విజయవాడ

ప్రధాని మోదీ వేసిన పునాదులతో 2047 నాటికి వికసిత భారత్‌ను చూస్తామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారిగా నరేంద్ర మోదీ ప్రమాణం చేసి 23 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆయనకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా 23 ఏళ్ల క్రితం ఇదే రోజున నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారని పవన్ కల్యాణ్ తెలిపారు. విప్లవాత్మక నిర్ణయాలతో కోట్లాది మంది భారతీయుల జీవితాలను మార్చడం ఆ రోజుతోనే మొదలైందని అన్నారు. ఆయన నాయకత్వంలో మన దేశం విశ్వవ్యాప్తంగా కీర్తిని పొంది.. అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని చెప్పారు. త్వరలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. ఇన్నేళ్లుగా అంకిత - మిగతా3లో



## బొగ్గు గనిలో భారీ పేలుడు

- ఏడుగురు దుర్మరణం
- పలువురు గాయాలు..
- ప్రమాదకరంగా కొందరి పరిస్థితి
- పేలుడు ధాటికి బొగ్గు గని సమీపంలోని పార్కింగ్ వాహనాలు సైతం ధ్వంసం
- గంగారామ్‌చక్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన గనిలో బొగ్గు వెలికి తీసేందుకు బాంబులు పెడుతుండగా ఈ పేలుడు సంభవించినట్టు సమాచారం

# ధర్మవరం రూపు రేఖలను మార్చే హ్యాండ్లూమ్ క్లస్టర్

-మొదటిపేజీ తరువాయి

మంత్రి తెలిపారు. దాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. అత్యుత్తమ నాణ్యతతో కూడిన చేనేత, పట్టు చీరెల తయారీ నిపుణులకు ధర్మవరం పుట్టినిల్లని సత్యకుమార్ లేఖలో వివరించారు. ఆధునిక యాంత్రిక యుగంలో పవర్లూమ్స్ విపరీతంగా పెరిగిపోతుండటంతో ధర్మవరం సంప్రదాయ పట్టు చీరెల తయారీ రంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని మంత్రి తెలిపారు. దీంతో ఈ రంగంపై ఆధారపడిన వారి ఆదాయం గణనీయంగా తగ్గిపోతూ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సవాళ్ల ఊబిలో చిక్కుకున్న ధర్మవరం చేనేత, పట్టు చీరెల ఉత్పత్తి రంగాన్ని గాడిలో పెట్టేందుకు తాను పంపుతున్న డీపీఆర్‌లో పలు ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర మంత్రికి సత్యకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని



సత్యసాయి జిల్లావ్యాప్తంగా దాదాపు 28,500కుటుంబాలు, ప్రత్యేకంగా ధర్మవరం ప్రాంతంలో 12,800 కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయని మంత్రి చెప్పారు. అందువల్ల చేనేత కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు, ఈ రంగంలో తగిన పోటీ తత్వాన్ని ప్రోత్సహించేందుకు తాను ప్రతిపాదించిన చర్యలు ఉపయోగపడతాయని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. దాదాపు రూ.30కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిస్తున్న ధర్మవరం హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటులో 80శాతం మేర నిధులు (సుమారు రూ.24కోట్లు) కేంద్రం భరిస్తే, మిగిలిన 20 శాతం నిధులు (రూ.6కోట్లు)ను ఏపీ ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలో వివరించారు. హ్యాండ్లూమ్ క్లస్టర్‌తో అనేక ప్రయోజనాలు, ఎన్నో కుటుంబాలు ఆధారపడే అవకాశం ఉన్నందున డీపీఆర్‌ను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# వారాహి డిక్లరేషన్.. ప్లస్సా... మైనస్సా...

**తిరుపతి :** జనసేనాని జనం మెచ్చిన సేనాని అయ్యారు. ఇప్పుడు హైందవ సేనానిగా మారుతున్నారు. నిష్టగా దీక్షలు చేస్తూ హైందవ ధర్మం కోసం పోరాటం అంటూ.. బీజేపీని మించిన ఎజెండాతో దూసుకెళ్తున్నారు. తిరుమల లడ్డూ ఇష్యూలో పవన్ ఎంట్రీతో సీన్ మారిపోయింది. టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు లడ్డూ వివాదాన్ని ఎంత వరకు అడ్రస్ చేయాలో అంతే ప్రస్తావించి..తర్వాత సైలెంట్గా ఉండిపోయారు. ఒకవేళ మాట్లాడినా ఆలయ పవిత్రతను దెబ్బతీశారని చెప్పారే తప్ప..ఇతర మతాల ప్రస్తావన తేలేదు.పవన్ కల్యాణ్ మాత్రం లడ్డూ ఇష్యూను పీక్స్‌కు తీసుకెళ్లారు. ఇతర మతాల విషయంలో ఇలాగే జరిగితే ఊరుకుంటారా..సనాతన ధర్మం మీద మాట్లాడకూడదంటే ఎలా అని ప్రశ్నించారు. పాయశ్చిత దీక్ష చేసి..తర్వాత వారాహి డిక్లరేషన్ ప్రకటించడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని గళమెత్తుతున్నారు. అంతేకాదు సనాతన ధర్మానికి ఇబ్బందులు ఎదురైతే చూస్తూ ఊరుకోనని అంటున్నారు. ఎంతకైనా వెళ్ళి తేల్చుకుంటామని చెప్పారు. రాజకీయాలను కూడా పక్కన పెట్టి ముందుకు సాగుతానని కూడా చెప్తున్నారు. హిందుత్వం విషయంలో ఏపీ బీజేపీ నేతలు ఎవరూ ఈ స్థాయిలో రియాక్ట్ కావడం లేదు. కానీ జన బలమున్న పవన్ హిందుత్వ ఎజెండాను భుజానికి ఎత్తుకున్నట్లు కనిపిస్తోంది.చంద్రబాబు శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో కల్తీ ఉందని అనేసి ఊరుకుంటే..ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇలానే జరిగిందని..ఏకంగా అయోధ్యకు పంపిన లడ్డూ ప్రసాదాలను ప్రస్తావిస్తూ అగ్గి రాజేస్తున్నారు పవన్. వారాహి సభలో సూడో సెక్యూలరిజం అంటూ సేనాని మాట్లాడిన మాటలు కూడా చర్చనీయాంశంగా అవుతున్నాయి.అయితే బీజేపీని మించి పవన్ హిందుత్వ




ఎజెండా ఎత్తుకోవడం హాట్ టాపిక్ అవుతోంది. ఎందుకు ఆయన అంతగా రియాక్ట్ అవుతున్నారనే దానిపై రకరకాల చర్చలు ఉన్నాయి. బీజేపీకి దగ్గరయ్యేందుకే పవన్ పూర్తిస్థాయి హైందవ సేనాని అయిపోయారని పొలిటికల్ ఎనలిస్టులు అభిప్రాయపడుతున్నారు. పవన్ ధర్మాగ్రహం వెనక ఆయన ఆలోచనలు ఆయనకు ఉన్నాయంటున్నారు.అయితే కూటమిలో ఉంటూ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్..వీర హిందూత్వ గళం వినిపించడం ద్వారా కూటమికి ప్లస్ చేస్తున్నారా లేక మైనస్ చేస్తున్నారా అన్నదే చర్చ అవుతోంది. టీడీపీ మాత్రం అన్ని మతాలను సమానంగా చూస్తామని..సెక్యూలరిజమే తమ ఎజెండా అంటోంది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న పవన్ మాత్రం హిందుత్వ గళం ఎత్తుకున్నారు. ఒక విధంగా పవన్ చేస్తున్న ప్రకటనలు బీజేపీకి ఆనందంగానే ఉంటాయి. కానీ టీడీపీనే ఇబ్బందుల్లో పడుతోందని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు.ఏపీ కూటమి సర్కార్లో భాగస్వామిగా ఉన్న బీజేపీ ఉమ్మడి పౌర స్మృతితో పాటు ముస్లిం రిజర్వేషన్ల రద్దు వంటి నిర్ణయాల మీద ఎన్నికల వేళ గట్టిగానే మాట్లాడింది. ఇప్పుడు వక్ఫ్ బోర్డు రద్దు అంటోంది కేంద్రం. దానికి సంబంధించిన బిల్లు ఈ శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్లో ప్రవేశపెడతారని అంటున్నారు. టీడీపీ, జనసేన స్టాండ్ ఏంటో కూడా స్పష్టం కానుంది. అయితే లడ్డూ ఇష్యూ తర్వాత కూడా పవన్ వారాహి డిక్లరేషన్ మీద మరింత జోరు పెంచుతారా అన్నది చర్చనీయాంశంగా మారింది. వారాహి డిక్లరేషన్ మీద ఇదే దూకుడుతో పవన్ ముందుకెళ్తే ఏపీలో సరికొత్త రాజకీయాలకు తెరదీసే అవకాశం ఉంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు.

**తప్పు పట్టిన హర్షకుమార్**

సనాతన ధర్మం పేరుతో పవన్ కల్యాణ్, లడ్డూల పేరుతో చంద్రబాబు.. హిందువుల మనోభావాలను రెచ్చగొట్టి మిగిలిన పార్టీలను భూస్థాపితం చేయాలని అనుకోవడం పొరపాటు. ప్రజలు పరిపాలన చూస్తారని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు.మీ పరిపాలనలో ఇప్పటివరకు ఒక పెన్షన్, ఒక అన్న క్యాంటీన్లు తప్పించి చేసిందేమీ లేదు. ఇసుక ఎక్కడా దొరకడం లేదు. స్కాలర్ షిప్స్ ఇప్పటివరకు ఇవ్వలేకపోయారు. అనేక హామీలు ఇచ్చారు. అందులో ఏదీ కూడా చంద్రబాబు సక్సెస్ అవ్వలేదు. చంద్రబాబు ప్రభుత్వం ఫెయిల్యూర్ గవర్నమెంట్. మూడు నాలుగు నెలల్లోనే ఫెయిల్డ్ గవర్న్ మెంట్ గా ప్రజలు మిమ్మల్ని చూస్తున్నారు. వీటన్నింటిని కప్పి పుచ్చుకోవడానికి హిందువుల మనోభావాలను రెచ్చగొట్టేందుకు వేసిన ప్లాన్లే లడ్డూలు, సనాతన ధర్మం. అటువంటి జిమ్మిక్కులు చేయకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్ పరిపాలనపై దృష్టి పెట్టాలి" అని హర్షకుమార్ సూచించారు.

# విశాఖలో కొత్త రకం ట్రాప్

**విశాఖపట్టణం :** అందమైన రూపం.. ఆకట్టుకొనే అభినయం.. మాటల కవ్వింపులు.. వయ్యారాల పలుకులు.. ఇంకేముంది అదృష్టం తలుపుతట్టింది అనుకుంటున్నారా.. అయితే మీకు చిక్కులు వచ్చినట్లే. మీ పరువుకు భంగం కలిగినట్లే. సోషల్ మీడియా ద్వారా చిలుక పలుకులు పలకడం.. ఆ తర్వాత బ్లాక్ మెయిలింగ్ చేయడం నేటి సమాజంలో పలువురికి ఒక వృత్తిలా మారింది. ఇలా ఎందరినో వలలో వేసుకొని, మోసం చేసిన ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మహిళ బాధితుల లిస్ట్ తీస్తున్న పోలీసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైంది. అందుకే నేరస్తులు సైతం ఇదే మాధ్యమాన్ని వాడుకొని.. ఎందరినో బురిడీ కొట్టిస్తున్నారు. హనీ ట్రాప్ పేరిట జరిగే మోసాలు అయితే రోజురోజుకు అధికమవుతున్నాయి. హనీ ట్రాప్ అంటే ఏమిటో తెలుసా.. సోషల్ మీడియా ద్వారా పరిచయం కావడం.. ఆ తర్వాత వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడం.. మత్తు ప్రయోగించడం.. ప్రవేట్ ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేయడం. ఇంతకు ఇలా చేస్తున్నది ఎవరో అనుకొనేరు కొందరు అందమైన యువతులు. అందమైన వారే ఎందుకో తెలుసా.. వెంటనే బురిడీ కొట్టించి లక్షలు దండుకోవడం వీరి వంతు.ఇలాంటి ఘటన జరిగిన నేపథ్యంలో విశాఖ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎన్నో సంచలనమైన కేసులను చేధించిన విశాఖ పోలీసులు.. ఈ కేసు అంతు తేల్చేలా పక్కా ప్రణాళికతో దర్యాప్తు చేసి నిందితురాలు జాయ్ జెమిమాను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు షాకుల మీద షాకులు తగిలాయి.హనీ ట్రాప్ పేరిట ఒక ముఠాగా ఏర్పడ్డ దుండగులు.. పథకం ప్రకారం జెమిమాను ఉపయోగించి సోషల్ మీడియా ద్వారా ఎందరినో బురిడీ కొట్టించారు. ముందు పరిచయం.. ఆ తర్వాత మత్తు ఇవ్వడం.. అసభ్యకర వీడియోలు తీయడం.. ఇక



బెదిరించడం ఇలా సాగేది ఈ ముఠా పని. అలాగే సంబంధిత మహిళకు ఎలా బుట్టలో పడవేయాలో ట్రైనింగ్ కూడా ఇచ్చారంటే ఈ ముఠా కథ వేరే అని చెప్పవచ్చు.అయితే ఈ కేసు గురించి విశాఖ సీపీ బాగ్చి మాట్లాడుతూ.. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. వీరి వలలో పడి మోసపోయిన వారు.. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఇదొక ముఠాగా తాము గుర్తించామని, అన్ని ఆధారాలు సేకరిస్తున్నట్లు.. త్వరలోనే మిగిలిన ముఠా సభ్యులను అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత యువకుడికి ఫోన్ చేసి అమెరికా నుంచి విశాఖకు రప్పించింది. ఎయిర్‌పోర్టుకు రాగానే మురళీనగర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి బంధించింది. మత్తు పదార్థాలు కలిపిన జ్యూస్‌లు, డ్రింక్స్ ఇచ్చి పెర్ఫ్యూమ్ స్ప్రే చేస్తూ మైకంలో ఉన్నప్పుడు శారీరకంగా కలిసినట్లు ఫొటోలు తీయించింది. వాటితో యువకుడిని బ్లాకెమెయిల్ చేసింది. దీంతో బెదిరిపోయిన యువకుడు తన తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పిస్తానని చెప్పాడు. అయినా వినిపించుకోకుండా జెమిమా తన సహచరులతో కలిసి తరచూ బెదిరించేంది. ఇటీవల భీమిలిలోని ఓ హోటల్‌లో బలవంతంగా నిశ్చితార్థం చేసుకుని యువకుడితో రూ.5 లక్షలు ఖర్చు చేయించింది. తర్వాత నిశ్చితార్థం, ఏకాంతంగా ఉన్న ఫొటోలు చూపించి మురళీనగర్‌లోని తన ఇంట్లో నిర్బాంధించింది. పెళ్లి చేసుకోకపోతే.. కేసు పెట్టి అమెరికా వెళ్లకుండా చేస్తానని బెదిరింపులకు పాల్పడింది. డబ్బులు కాజేసింది.ఒక రోజు యువకుడు పారిపోయేందుకు యత్నించాడు. దీంతో సహచరులతో కలిసి కత్తితో బెదిరించి చంపడానికి యత్నించింది. జెమిమాను పెళ్లి చేసుకోకుంటే చంపేస్తామని ఆమె అనుచరులు కూడా బెదిరించారు. అక్టోబర్ 4న బాధితుడు తప్పించుకుని భీమిలి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు జెమిమాతోపాటు ఆమె అనుచరులను అరెస్టు చేశారు. జెమిమా గతంలో కూడా తన స్నేహితులతో కలిసి ధనవంతులైన అబ్బాయిలను ట్రాప్ చేసి భారీగా డబ్బులు వసూలుచేసినట్లు పోలీసులు తెలిపారు.అలాగే సోషల్ మీడియా వేదికగా జరిగే నేరాల పట్ల యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహం చిక్కులే తెచ్చే పరిస్థితులు ఉన్నాయని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు విశాఖ సీపీ బాగ్చి.

## పవన్ ఫామ్ కోల్పోతారా...

**తిరుపతి :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ అయిన తర్వాత ఒకింత ఫామ్ కోల్పోతున్నారా? ఏదో చేద్దామని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఏమీ చేయలేక నిరాశ నిస్పృహలో మిగిలిపోయారా? అందుకే సనాతన ధర్మం ముసుగు వేసుకుని తిరుగుతున్నారా? అన్న కామెంట్స్ ఇప్పుడు ఆయన అభిమానులనే కాదు కాపు సామాజికవర్గాన్ని కూడా వేధిస్తున్నాయి. ఎన్నికల ముందు వరకూ పవన్ కల్యాణ్ లో కనిపించని సనాతన ధర్మం ఇప్పుడు ఒక్కసారిగా కనిపించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ ఘటనలు జరిగాయా? కదా? అన్న ప్రశ్నకు ఆయన నుంచి సమాధానం లేదు.అప్పుడు రామతీర్థంలో రథం తగలపడటం వంటి ఘటనలు జరిగినా పవన్ కల్యాణ్ కు అప్పుడు సనాతన ధర్మం ఎందుకు గుర్తుకు రాలేదని, నాడు ఆ దుస్తులు ఎందుకు ధరించలేదని, ఎందుకు ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టలేకపోయారన్న సందేహాలు ఆయన ఫ్యాన్స్ లో ప్రతి ఒక్కరిలో తలెత్తుతున్నాయి. ఆనాడు గుర్తుకు రాని, పాటించని సనాతన ధర్మాన్ని ఒక్కసారిగా అధికారంలోకి రాగానే ఎందుకు గుర్తుకు వచ్చిందని, విపక్షంలో చేయాల్సిన పనులు అధికారంలో ఉన్నప్పుడు చేయడానికి గల కారణాలు ఏమై ఉంటాయా? అన్న అనుమానాలు అందరిలోనూ ఉన్నాయి. కానీ అందుకు సమాధానం చెప్పాల్సింది పవన్ కల్యాణ్ మాత్రమే. అందుకు కారణాలు కూడా ఆయనకు మాత్రమే తెలిసి ఉంటుందిఒక్కసారిగా పవన్ కల్యాణ్ లో ఈ మార్పు రావడానికి కారణం ఏమై ఉంటుందా? అన్నది అర్థం కాకుండా ఉంది. ఒకవేళ పవన్ కల్యాణ్ ను వెనక నుంచి ఎవరైనా ఇలా చేయమని ప్రోత్సహిస్తున్నారా? అది రాష్ట్ర స్థాయిలో కాకుండా దేశ స్థాయిలో జరుగుతుందా? అన్న సందేహాలు కూడా లేకపోలేదు. ఎందుకంటే ఇప్పటికే సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్ ఈ సనాతన ధర్మం నినాదం అందుకోవడం వెనక బీజేపీ ఉందన్న కామెంట్స్ బాగానే వినపడుతున్నాయి. అయితే అందులో నిజం ఎంతో తెలియదు కానీ, దక్షిణ భారత దేశంలో బలమైన హిందుత్వ వాది తమకు అవసరం కావడంతో అందుకు పవన్ కల్యాణ్ ను వినియోగిస్తున్నారని అంటున్న వారు అనేక మంది ఉన్నారు.కానీ బీజేపీ అలాంటి పని చేయకపోవచ్చు. బీజేపీ సొంతంగానే ఎదుగుతుంది. మరొకరి చేతిలో, మరొక పార్టీ అధినేత చేతిలో హిందుత్వ నినాదాన్ని అప్పగించి తాను తప్పుకునేంత పిచ్చిపనులు చేయదన్నది కూడా మరికొందరి వాదన. కానీ పవన్ కల్యాణ్ మాత్రం సనాతన ధర్మంతో పాటు ప్రాయశ్చిత్త దీక్ష వంటి వాటితో కొన్ని వర్గాలకు దూరమవుతున్నారన్న ఆందోళన కూడా ఆయన అభిమానుల్లో వ్యక్తమవుతుంది.

## 2047 నాటికి వికసిత్ భారత్‌ను చూస్తాం

-మొదటిపేజీ తరువాయి

భావంతో పనిచేస్తూ ప్రజా సేవ కంటే మరేది ముఖ్యం కాదని మోదీ నిరూపించారని చెప్పారు. భారత దేశ వైవిధ్యతతను లోతుగా అర్థం చేసుకోవడంతో పాటు ప్రజలతో కలిసిపోగలిగే లక్షణాలు.. క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంతో పాటు మార్పు తీసుకురావడంలో సహాయం చేశాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన నాయకత్వం దేశాన్ని పురోగమించే దిశగా తీసుకెళ్లడంతో పాటు.. అనేక మంది జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.ఆయన వేసిన పునాదులతో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని చూస్తామని అభిప్రాయపడ్డారు.

**మరోసారి ఎంజీఆర్ గురించి ట్వీట్ చేసిన పవన్ కల్యాణ్**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ మధ్య ట్వీట్ల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. తిరుపతి లడ్డూ కల్తీ, సనాతన ధర్మం అంశంలో ఇరువురి మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఇటీవల పవన్ కల్యాణ్ ఎంజీఆర్, అన్నాడీఎంకే గురించి ట్వీట్ చేయగా.... ఎంజీఆర్ పై హఠాత్తుగా ఎందుకింత ప్రేమో, పైనుంచి ఆదేశాలు అందాయా అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శనాత్మకంగా స్పందించారు. ఈ క్రమంలో, పవన్ కల్యాణ్ మరోసారి ఎంజీఆర్ గురించి ట్వీట్ చేశారు. పురచ్చి తలైవర్, శ్రీ ఎంజీఆర్ నుంచి పాఠాలు నేర్చుకున్నానని పవన్ వెల్లడించారు. ఈ మేరకు తాను గతంలో ఎంజీఆర్ గురించి చేసిన కామెంట్ల తాలూకు వీడియోలను పంచుకున్నారు. ఎంజీఆర్ పై హఠాత్తుగా ఎందుకింత ప్రేమ పుట్టుకొచ్చిందో అని ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గానే పవన్ తాజా ట్వీట్ చేసినట్టు నెటిజన్లు భావిస్తున్నారు. ఇప్పుడే కాదు, గతంలోనే ఎంజీఆర్ గురించి మాట్లాడానని చెప్పడమే పవన్ ఉద్దేశమని పలువురు నెటిజన్లు అభిప్రాయపడ్డారు.

## రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. పోలవరం మొదట విడత నిధులు, రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంకు ద్వారా అందించే రూ.15కోట్లపైనా ఇరువురు చర్చించారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపన అంశాలనూ ప్రధాని దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఏపీ సీఎం సమావేశం అయ్యారు. ఢిల్లీలోని చంద్రబాబు అధికారిక నివాసానికి వచ్చిన కేంద్ర మంత్రితో ఏపీలో రైల్వే ప్రాజెక్టులు, వైజాగ్ రైల్వే జోన్‌పై కూలంకశంగా చర్చించారు సెయిల్‌లో విశాఖ స్టీల్ విలీనం, రాష్ట్రంలో వివిధ రహదారుల అభివృద్ధి, రైల్వేజోన్ శంకుస్థాపన తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కాగా రేపు (మంగళవారం) పలువురు కేంద్ర మంత్రు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్ , పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురితో కలువనున్నారు.

## ఏపీలో కొత్త జిల్లాలు..
## ఆ రెండు జిల్లాలు రద్దు..

-మొదటిపేజీ తరువాయి

వ్యక్తమయ్యాయి. మరికొన్ని జిల్లాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. ఇదే విషయమై టీడీపీ కూటమి హామీలు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొత్త జిల్లాల ఏర్పాటుతోపాటు ప్రస్తుతం ఉన్న జిల్లాల్లో మార్పులు చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. కొత్తగా మరో నాలుగు జిల్లాను ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని 30 జిల్లాలుగా పునర్నిర్మాణం చేస్తారని సోషల్ మీడియాలో ఓ పోస్టు జోరుగా సర్కులేట్ అవుతున్నది. దాని ప్రకారం పలాస, నాగావళి, నూజివీడు, తెనాలి, అమరరామ, మార్కాపురం, మదనపల్లి, హిందూపురం, ఆదోని జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ స్వస్థలం నిమ్మకూరు ఉన్న ప్రాంతానికి ఎన్టీఆర్ మచిలీపట్నం జిల్లాగా మార్చనున్నారని, ప్రస్తుతం ఉన్న ఎన్టీఆర్ జిల్లా ఇకపై కృష్ణా? జిల్లా, వైఎస్సాఆర్ జిల్లాకు వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చనున్నారు. రాష్ట్రాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించనున్నట్లు అందులో ప్రస్తావించారు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న జిల్లాలను రద్దు చేస్తారనే ప్రచారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పందించింది. 'ఒక సామాన్యుడు ఇచ్చిన సలహాని, ప్రభుత్వ నిర?యంగా ప్రకటిస్తూ, సమాజంలో అశాంతి రేపడానికి కొంత మంది అల్లరి మూకలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా రద్దు చేస్తున్నారు అనేది పూర్తిగా అవాస్తవం' అంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న డాక్యుమెంట్‌ను ఎవరూ నమ్మొద్దని కోరింది. ఈ జిల్లాల అంశంలో ప్రభుత్వం ఎలాంటి నిర?యం తీసుకోలేదని వెల్లడించింది.

## అందరి క్షేమం కోరే మనసున్న
## మంచి ప్రభుత్వం తమది

-మొదటిపేజీ తరువాయి

రూ.10 వేలకు పెంచడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. దాంతో రాష్ట్రంలోని 5,400 చిన్న ఆలయాల్లో ఎటువంటి ఆటంకం లేకుండా భగవంతుడి సేవకు ఆస్కారం ఏర్పడిందని తెలిపారు. అందరి క్షేమం కోరే మనసున్న మంచి ప్రభుత్వం తమదని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## దేవరగట్టు కర్రల సంబరాలకు సర్వం సిద్ధం.

కర్నూలు : దసరా పండుగ సందర్భంగా దేవరగట్టు కర్రల సంబరానికి భక్తులు సిద్ధమవుతున్నారు. ఆలూరు నియోజకవర్గం లోని దేవరగట్టులో ప్రత్యేక విజయదశమి పండుగ రోజు మాల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా జరిగే సంప్రదాయ సమరమే కర్రల సమరం. దీనినే స్థానికంగా బన్నీ ఉత్సవం అని కూడా అంటారు. ఈ ఉత్సవానికి ఆంధ్రతో పాటు తెలంగాణ కర్ణాటక మహారాష్ట్ర నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు. మాల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లడంలో భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి జరుపుకునే ఉత్సవమే సమరమే కర్రల సమరం బన్నీ ఉత్సవం గా పిలుస్తారు. ఈ కర్రల సంబరానికి కొంతమంది మద్యం సేవించి వస్తుండటంతో కర్రలు తిప్ప లేక,.. కర్రల చివర్లో ఉండే ఇనుప చివ్వలు తగిలి తలలు పగులుతున్నాయి. సమరంలో వాడే దివిటీల నుంచి నిప్పు రవ్వలు పడి , తొక్కిసలాటలో కిందపడి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.ఈసారి హింసను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్వయంగా దేవరగట్టును పరిశీలించారు. బందోబస్తును సిద్ధం చేస్తున్నారు. ఈనెల 12న దసరా పండుగ రోజు అర్ధరాత్రి ఈ ఉత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ ఉత్సవానికి బందోబస్తుగా 1000 మందికి పైగా పోలీసులు ఉంటారు. వివిధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఎట్టి పరిస్థితులలో హించకు తావు లేదని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ చెప్తున్నారు

## రూ.80కి చేరిన టమాటా

రాజమండ్రి : టమాటా ధరలు ఒక్కసారిగా సెంచరీ కొట్టేస్తోంది. ఎక్కడ చూసీన 80 రూపాయ కంటే తక్కువకు కిలో టమాటా దొరకడం లేదు. నిన్న మొన్నటి వరకు 50రూపాయల్లోపు ధర పలికే టమాటా ఇప్పుడు ఒక్కసారిగా డబుల్ అయిపోయింది. కొనేందుకు వెళ్తున్న వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉన్న వాటినోత సరిపెట్టుకుంటున్నారు. అసలే పండగ సీజన్ ఆపై ధర పెరిగిపోవడంతో ఏం తినాలని వాపోతున్నారు. టమాటా లేనిదే దాదాపు ఎవరింట్లో కూడా వంట పూర్తి కాదు. వెజ్ ఆర్ నాన్‌వెజ్ ఏం వండినా టమాటా ఉంటే ఆ వంటకానికి అదనపు రుచి వస్తుంది. కుటుంబానికి సరిపడేలా వంటకం పూర్తి అవుతుంది.ఇప్పుడు టమాటో వందకు చేరుకోవడంతో వినియోగదారులు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. కొందరు చింతపండును వినియోగిస్తుంటే మరికొందరు నిమ్మకాయలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో వాతావరణ పరిస్థితులకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడ పండించే పంట పూర్తిగా నాశనమైపోయింది. అక్కడి దిగుబడి పూర్తిగా పడిపోయింది. మధనపల్లిలో పరిస్థితి అంతే ఉంది. ఈ మూడు ప్రాంతాల నుంచి వచ్చే టమాటా ఒక్కసారిగా తగ్గిపోవడంతో పరిస్థితి మారిపోయింది. మొన్నటి వరకు యాభైరూపాయల వరకు ఉండే టమాటా ధరలు ఇప్పుడు ఏకంగా వంద రూపాయలకు చేరాయి. ఇప్పట్లో ఈ ధరలు తగ్గే అవకాశం లేదని తెలుస్తోంది. మదనపల్లె మార్కెట్‌లోనే టమాటా ధర 80 రూపాయలకుపైగా పలుకుతోంది. అంటే మిగతా ప్రాంతాలకు ఆ సరకు వెళ్లే సరికి వంద రూపాయలకు పైమాటే అంటున్నారు

ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటిని సన్మానించిన ఎమ్మెల్యే ఉగ్ర 4

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# జీతమే ముద్దు...విధులు మాకొద్దు

## విధులకు దుమ్మా కొడుతున్న ముటుకుల, కవలకుంట్ల విద్యుత్ సబ్ స్టేషన్ వాచ్‌మెన్‌లు

## నెలలో ఒకటి లేక రెండుసార్లు మాత్రమే విధులకు హాజరు

## వారికి బదులుగా వేరొకరు నైట్ వాచ్‌మెన్ విధులు?

## అధికారుల మౌనం వెనక ఆంతర్యం ఏమిటో..?



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, అక్టోబర్ 7)

**ప్రభుత్వం నుంచి మాకు జీతం మాత్రం కావాలి....కానీ ఉద్యోగం మాత్రం మేము చేయం...మా స్థానంలో మరొకరు చేస్తారులే....అన్న రీతిలో మండలంలోని కవలకుంట్ల, ముటుకుల విద్యుత్ సబ్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్‌ల పరిస్థితి. విధులకు దుమ్మా కొట్టి వేరొకరిని పనిలో పెట్టినా మాకేం తెలియదు....ఇక్కడ అలాంటిదేమీ జరగలేదన్నట్లుగా స్థానిక అధికారుల నుంచి పై స్థాయి అధికారుల వరకు వ్యవహరిస్తున్నారు. విధులకు ధుమ్మా కొట్టినా నెల నెలా జీతం మాత్రం ఖచ్చితంగా తీసుకుంటున్న వీరి తీరు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.**

వివరాల్లోకి వెళితే విద్యుత్‌శాఖ పుల్లలచెరువు మండలంలోని కవలకుంట, ముటుకుల విద్యుత్ సబ్ స్టేషన్ లకు సంబంధించి వాచ్‌మెన్‌లుగా రత్తయ్య, పోలయ్య విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరు ఏదో ఒక రకంగా వారి విధులకు దుమ్మా కొడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. వారి స్థానంలో తాత్కాలికంగా ప్రైవేటు వ్యక్తులను నియమించి నెలకు రూ.4000 వేల ప్రకారం ఇస్తూ పనులు కానిచ్చేస్తున్నట్లు ఆ శాఖలో గుప్పుమంటుంది. విధులకు రాకుండా దుమ్మా కొడుతూ జీతాన్ని మాత్రం తీసుకోవడం జరుగుతుంది. 24 గంటలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కాపలాగా ఉండి విధులను నిర్వర్తించాల్సిన వాచ్‌మెన్‌లు విధులకు ఎగనామం పెట్టి దుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వారికి బదులుగా ఉండే వారు కూడా ఎప్పుడో రాత్రి తొమ్మిది, పది గంటలకు వస్తున్నారని అక్కడివారు చెబుతున్నారు. పైగా ప్రశ్నించిన వారికి మాత్రం ఉన్నతాధికారులు సర్దుబాటు ధోరణితో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా విధులకు డుమ్మా కొట్టే వ్యవహారం అధికారులకు తెలిసే మౌనంగా ఉన్నారా లేదంటే తెలియకపోవడం వలన మౌనంగా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పుడైనా కానీ అధికారులు స్పందించి వీరిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి. ఒకవేళ అధికారులు మామూళ్లకు కక్కుర్తిపడి సర్దుబాటు చేసి నెలవారి జీతానికి మాత్రం ఏ ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరి వాస్తవాలు ఏమిటనేది జిల్లా అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

**విధులకు డుమ్మా కొట్టి పట్టణాలలో నివాసముంటున్న విద్యుత్ సిబ్బంది.**

ఎక్కడైతే ఉద్యోగంలో విధులు నిర్వహిస్తారో సిబ్బంది అక్కడే నివాసం ఉండాలి. కాని దీనికి భిన్నంగా ఉన్నారు కవలకుంట్ల, ముటుకుల వాచ్‌మెన్‌లు రత్తయ్య, పోలయ్య. విధులకు డుమ్మా కొట్టి వారికి బదులు ప్రైవేట్ వ్యక్తులను విధులకు పంపిస్తూ వారు మాత్రం ఒకరు పొదిలిలో, మరొకరు యర్రగొండపాలెంలో నివాసముంటు వారి సొంత పనులు చేసుకుంటూ నెల నెలా జీతం మాత్రం తీసుకుంటున్నారని సమాచారం. ఈ వ్యవహారాన్ని పుల్లలచెరువు వెలుగు ప్రతినిధి ప్రత్యక్షంగా కవలకుంట్ల సబ్ స్టేషన్‌కు వెళ్ళి పరిశీలించగా అక్కడ షిఫ్ట్ ఆపరేటర్ ఒక్కరే ఉండడం గమనార్హం. అక్కడ ఉండే వాచ్‌మెన్ కానీ బినామీ వాచ్‌మెన్ కాని లేకపోవడం వెలుగు చూసింది.

**ఎవరికి తెలిసినా నష్టం లేదు**

ఉన్నతాధికారులకు ఎవరికి తెలిసినా తమకేమి నష్టం లేదని ఓ వాచ్‌మెన్ వెలుగు ప్రతినిధితో చెప్పడం విశేషం. నిజంగా ఉద్యోగం కావాలని తిరిగే చాలా మంది వాచ్‌మెన్ ఉద్యోగాలు కూడా దొరక్క నానా అగచాట్లు పడుతుంటే వీరు మాత్రం వచ్చిన ఉద్యోగాన్ని వేరకరికి ఇచ్చి వీరు మాత్రం దర్జాగా సొంతపనులు చేసుకుంటున్నారు. మరి జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఈ వ్యవహారం పై ఎలా స్పందిస్తారో...ఎటువంటి చర్యలు చేపడతారో వేచి చూద్దాం మరి...!

# జిల్లాలో సంవృద్ధిగా ఇసుక నిల్వలు

## జిల్లా కలెక్టర్ ఆనంద్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 7)

జిల్లాలో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, జిల్లాలోని మూడు ఇసుక యార్డులలో 70వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. జిల్లాలో ఇసుక నిల్వలు, సరఫరా పై సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్, ఎస్పీ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేదని, ప్రజల అవసరాల కంటే రెట్టింపు ఇసుక అందుబాటులో వుందని చెప్పారు. జిల్లాలోని మూడు ఇసుక యార్డులలో 70వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. మన జిల్లాలో గత ఏడాది కంటే 50శాతం తక్కువ ధరకు ఒక టన్ను ఇసుకను రూ.350కే అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రతి రోజూ సుమారు 3500 టన్నుల ఇసుక అవసరమవుతుందని, మన దగ్గర సుమారు 4500 టన్నుల వరకు ఇసుక అందుబాటులో వుందని, దీనిని 7000 మెట్రిక్ టన్నుల వరకు పెంచనున్నట్లు కలెక్టర్ చెప్పారు. మన జిల్లాతో పాటు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు ఇసుకను అందించనున్నట్లు చెప్పారు. కందుకూరులో మరో యార్డును ప్రారంభిస్తున్నామని, ఈనెల 15వ తేదీ తరువాత మరో నాలుగు ఒపెన్ రీచ్‌లను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మినగల్లు, పడమటి కంభంపాడు, పల్లిపాడు, విరువూరులో ఈ ఓపెన్ రీచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో డీ సిల్టేషన్ పాయింట్ల ద్వారా 2,26,198 టన్నులు, సెమి మెకన్సైజ్డ్ రీచ్‌ల ద్వారా 13,03,500 టన్నులు, ఓపెన్ రీచ్‌ల ద్వారా 2,86,500 టన్నులు మొత్తం 18,16,198 టన్నుల ఇసుకను జిల్లాలో ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. ప్రజలు ఎవరూ కూడా ఇసుక కోసం దళారులను ఆశ్రయించవద్దని, ప్రజలందరూ ఏపి శాండ్ పోర్టల్ ద్వారా మాత్రమే ఇసుకను బుక్ చేసుకోవాలని సూచించారు. ఏపి శాండ్ పోర్టల్‌లో ఇసుక బుక్ చేసుకున్న వారు సొంత వాహనం ద్వారా ఇసుక తీసుకెళ్లవచ్చని లేదంటే పోర్టల్‌లోనే ట్రాన్స్‌పోర్టు (తరువాయి 4లో...)

# కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 7)

ఈ నెల 10వ తేదీ నాటికి జిల్లాలోని కరువు మండలాల ప్రతిపాదనలను పంపించాల్సివుందని, అందుకనుగుణంగా జిల్లాకు సంబంధించిన కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో రెవెన్యూ, వ్యవసాయ దాని అనుబంధ శాఖల అధికారులు, జలవనరులు, భూగర్భ జల శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశమై జిల్లాలోని కరువు మండలాలకు సంబంధించిన ప్రతిపాదనలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరువు మండలాల నిర్ధారణ కొరకు ప్రభుత్వం నిర్దేశించిన 6 ఇండికేటర్స్ ప్రకారం కరువు మండలాలకు సంబంధించిన ప్రతిపాదనలను సంబంధిత శాఖల అధికారులు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు, ఎంత తక్కువ వర్షపాతం నమోదైన వివరాలు, వ్యవసాయపరంగా గతంలో ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు. ఇప్పుడు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని విషయాన్ని, జిల్లాలో నీటిపారుదల శాఖ ద్వారా ఎంత విస్తీర్ణం భూమికి నీటిని అందిస్తున్నారనే విషయాల ఆధారంగా కరువు మండలాల ప్రతిపాదనలు సమర్పించాల్సి వుందన్నారు. అందుకనుగుణంగా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ (తరువాయి 4లో...)

# పొగాకు రైతులకు శాపం

## సొమ్ముల స్వాహాతో

## రాయితీ ఎరువులు దూరం



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, అక్టోబర్ 7)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో చోటుచేసుకున్న అవినీతి కుంభకోణం ఇప్పుడు పొగాకు రైతులకు కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టింది. రాయితీ ఎరువుల కోసం బోర్డు ద్వారా చెల్లించిన మొత్తాన్ని చెల్లించకుండా స్వాహా చేయడంతో సదరు సంస్థ ఈ ఏడాది ఎరువుల సరఫరా నిలిపేసింది. దీంతో అధిక ధరలకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఒక్కో బ్యారన్‌కు రూ.6 వేల నుంచి రూ.12 వేలు వరకు అదనపు భారం పడుతోంది.

**నిధులు నొక్కేశారిలా..** సహకార సంస్థలు మధ్యవర్తులుగా ఉండి రైతులకు ఎరువులు సరఫరా చేస్తే ఐపీఎల్ సంస్థ కొంత రాయితీ ఇస్తుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే బస్తాకు సుమారు రూ.100 తేడా ఉంటుంది. పొగాకు సాగుకు పొటాషియం సల్ఫేట్, డీఏపీ ఎరువులు అవసరం. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు అయిదేళ్ల క్రితం డీసీఎంఎస్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్యల ద్వారా రైతులకు ఐపీఎల్ ఎరువులు సరఫరా చేస్తున్నారు. వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు సాగించినప్పుడే ఎరువుల ఖర్చు కింద డబ్బులు మినహాయించి మిగిలినవి చెల్లిస్తారు. ఆ మొత్తాన్ని డీసీఎంఎస్, సమాఖ్యలకు పంపితే వారు ఐపీఎల్ నుంచి ఎరువులు తీసుకుని రైతులకు సరఫరా చేస్తారు. ఈ క్రమంలో డీసీఎంఎస్ అకౌంటెంట్ ఒకరు ఆ మొత్తాన్ని కంపెనీకి జమచేయకుండా దాదాపు రూ.3.52 కోట్లు తన సొంతఖాతాకు మళ్లించాడు. నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా కంపెనీకి డబ్బులు పంపే క్రమంలో ఉద్దేశపూర్వకంగా ఖాతా నంబరు తప్పుగా నమోదు చేశాడు. జమ కాకుండా తిరిగి వచ్చే నగదును తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. ఇందుకోసం ముందుగానే పాలకవర్గం అధ్యక్షురాలు, బిజినెస్ మేనేజర్ సంతకాలతో ఖాళీ (తరువాయి 4లో...)

# పొగాకు రైతులకు శాపం

చెక్కులు తీసుకున్నాడు. మొత్తం 11 విడతల్లో నిధులు మళ్లించాడు. నెలలు గడుస్తున్నా డబ్బులు జమకాకపోవడంతో కంపెనీవారు పొగాకు బోర్డుకు ఫిర్యాదు చేశారు. అధికారుల విచారణలో అసలు విషయం వెలుగు చూసింది.

**తూతూమంత్రం చర్యలతో సరి..**

సదరు ఉద్యోగి ఖాతా నుంచి రూ.3 కోట్లు రికవరీ చేశారు. మిగతా రూ.52 లక్షలు అతడు సొంతానికి వాడుకున్నాడు. ఈ వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమైనా చర్యలు తీసుకోలేదు. అపట్లో పర్చూరు వైసీపీ ఇంఛార్జిగా ఉన్న రావి రామనాథం సతీమణి డీసీఎంఎస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. బాధ్యతారహితంగా వ్యవహరించారంటూ అధ్యక్షురాలు, బీఎంలకు నోటీసులిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాలకవర్గాన్ని రద్దు చేశారు. తరువాత ఎన్నికలు రావడంతో విషయం మరుగున పడింది. బాధ్యుడైన ఉద్యోగి నుంచి మిగతా మొత్తం రికవరీ చేయలేదు. దీంతో కంపెనీ ఈ ఏడాది సొసైటీ ద్వారా ఎరువులు ఇచ్చేందుకు నిరాకరించింది. బోర్డు అధికారులు వేరే కంపెనీ ఎరువులు సరఫరా చేస్తామని చెప్పగా నాణ్యత ఉండదని రైతులు అంగీకరించలేదు. నాట్లు సీజన్ మొదలు కావడంతో విధిలేని పరిస్థితుల్లో బయట కొనుగోలు చేస్తున్నారు.

**మంత్రి దృష్టికి సమస్య..**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు అబ్బూరి శేషగిరిరావు తదితరులు వారి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి ఎరువులకు ఇబ్బందిలేకుండా చూడాలని కోరారు. స్పందించిన మంత్రి డీసీఎంఎస్ ఇన్‌ఛార్జిగా ఉన్న జేసీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# జిల్లాలో సంవృద్ధిగా ఇసుక నిల్వలు

సౌకర్యం కూడా ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌పోర్టు చార్జీలను సిస్టం ద్వారా నిర్ణయిస్తామని, ఆ మేరకు పోర్టల్‌తో అనుసంధానమైన 300పైగా ట్రాన్స్‌పోర్టర్లలో ఎవరైనా ముందుకొచ్చి ఇసుకను సిస్టం నిర్ణయించిన ధరకే రవాణా చేస్తారని చెప్పారు. ట్రాన్స్‌పోర్టు ధరల విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రజల అవసరాలకు పోను ప్రైవేటు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు బల్క్‌గా ఇసుక సరఫరాకు పోర్టల్‌లో 25శాతం కేటాయించామని, బల్క్ బుకింగ్స్‌ను జేసీ పరిశీలించి ఆమోదించనున్నట్లు చెప్పారు. ఇసుక పక్కదారి పట్టకుండా జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీని నియమించినట్లు కలెక్టర్ చెప్పారు. ఇసుక దుర్వినియోగం కాకుండా బుక్ చేసుకున్న ఇసుకను సక్రమంగా వినియోగిస్తున్నారా లేదా అని క్షేత్రస్థాయిలో సచివాలయ వ్యవస్థ, జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు.

**ఇసుక ఫిర్యాదులు, సమాచారం కోసం**
**టోల్‌ఫ్రీ నెంబర్ 0861-2943569 ఏర్పాటు**

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫెసిలిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, కోఆర్డినేషన్ టీంను 8మంది సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ టీం వినియోగదారులు, ట్రాన్స్‌పోర్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఇసుక సకాలంలో సరఫరా అయ్యేందుకు పనిచేస్తుందని చెప్పారు. ఇసుక ఫిర్యాదులు, సమాచారం, సందేహాల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 0861-2943569ను ప్రజలు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇసుకను పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని, ఎవరైనా సరే ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణా పై గట్టి నిఘా ఉంచాం : ఎస్పీ కృష్ణకాంత్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన ఇసుక విధానంలో అక్రమాలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్పీ కృష్ణకాంత్ చెప్పారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులతో క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు ఇసుక యార్డుల వద్ద సీసీ కెమెరాలతో నిఘా వుంచామని, గుర్తింపు పొందిన వాహనాలను మాత్రమే యార్డులలోనికి అనుమతిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ఇప్పటివరకు 350మందిపై కేసులు నమోదు చేశామని, 290కి పైగా వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. మీడియా వారు కూడా ఇసుక అక్రమాలపై సమాచారాన్ని తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ కూడా ఇసుక కోసం దళారుల మాటలు నమ్మకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు.

# ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు




**(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 7)**

ఇటీవల ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షునిగా నియమితులైన డాక్టర్ ఆకుపాటి వెంకటేష్‌ని సోమవారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పామూరు తెలుగుదేశం పార్టీ ఆఫీసు నందు ఘనంగా దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపిటిసిల బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. పార్టీ అభివృద్ధికి అందరు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పువ్వాడి వేంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు ఖాజా రహమతుల్లా నీరుకట్టు రసూల్ వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, నర్సింగ్ సాంబయ్య, ఆర్ఆర్ రఫీ, పందిటి హరీష్, మెంటా నరసింహారావు, బండ్ల నారాయణ, ఆవుల నారాయణ, దేవరపు మాల్యాద్రి, మౌలాలి, టిడిపి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, సిపిఓ వేంకటేశ్వరరావు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, ఐసిడిఎస్ పిడి మాధురి, ఎపిఎంఐపి పిడి రమణ, పశు సంవర్ధక శాఖ జేడి డాక్టర్ బేబి రాణి, గ్రౌండ్ వాటర్ డిడి విద్యా సాగర్, జిల్లా హార్టికల్చర్ అధికారి గోపి చంద్, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాగుంట కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 7)**

ఇటీవల అనారోగ్యంతో మాగుంట పార్వతమ్మ స్వర్గస్తులైన కారణంగా నెల్లూరులోని వారి స్వగృహంలో సోమవారం వారి కుటుంబ సభ్యులను మాజీ రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు పరామర్శించారు. అనంతరం పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కావలి మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధికి పాటుపడిన మహోన్నతులు ఎస్ఆర్ శంకరన్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 7)**

సమాజంలోని అన్ని పేద వర్గాల అభివ ృద్ధికి పాటుపడిన మహోన్నతులు ఎస్ఆర్ శంకరన్న అని డాక్టర్ నూకతోటి రవికుమార్ అన్నారు. సోమవారం అల్లూరు గ్రామంలోని అంబేద్కర్ బొమ్మ వద్ద ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి కార్యక్రమం ప్రైవేట్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూకతోటి రవికుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలు ఉన్నంతకాలం ఎస్ ఆర్ శంకరన్ వారి హృదయాలలో నిలిచిపోతారన్నారు. ఎస్ఆర్ శంకరన్ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్ట మార్గదర్శాలను రూపొందించిన మహనీయులన్నారు. పేదల అభివృద్ధికి పాటుపడాలని ఉద్దేశంతో తన వివాహం కూడా మానుకున్నా మహనీయులు ఎస్ఆర్ శంకరన్న అన్నారు. ఎస్ఆర్ శంకరన్ వెట్టిచాకిరి నిర్మించడంలో కీలక భూమిక పోషించారు. వారి సేవలను గుర్తు చేసుకోవడం కనీస పౌరులుగా మనభద్యతాన్నారు. ఎస్ఆర్ శంకరన్ సేవలు గుర్తించి పద్మభూషణ్ ప్రభుత్వం ప్రతిపాదించును ఎస్ఆర్ శంకర తిరస్కరించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శాంతారావు, ప్రైవేట్ లెక్చరర్ల సంఘం సభ్యులు పాల్గొని ఆయన చిత్రపటాన్ని ప్రజలకు పంచిపెట్టారన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు

**సీఐ పి సుబ్బారావు**



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 7)**

స్క్రాప్ దుకాణాల ద్వారా సంభవిస్తున్న ప్రమాదాలను అరికట్టే చర్యల్లో భాగంగా పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో స్క్రాప్ యాజమాన్యాలతో సోమవారం మార్కాపురం సిఐ పి సుబ్బారావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రాప్ వ్యాపారులంతా నిబంధనలు పాటించాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐ సైదుబాబు, ట్రైనింగ్ ఎస్ఐ, తదితరులు పాల్గొన్నారు.

# కరేడులో వరి, వేరు శనగ పైరు పై అవగాహన



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 7)**

మండలంలోని కరేడు1 రైతు సేవ కేంద్రం నందు సోమవారం నెల్లూరుజిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్. రమాదేవి, లక్ష్మీ మాధవి వరి, వేరుశెనగ పైరు పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వరి పైరులో నారుమడి యాజమాన్యం విత్తన ఎంపిక విత్తన శుద్ధి గురించి ప్రధాన పొలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు అనగా సమగ్ర ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ విధానాల మీద ఏ పురుగు ఎప్పుడు ఆశిస్తుంది అనే అంశాల మీద పలు యాజమాన్య పద్ధతుల మీద రైతులకు అవగాహన కలిగించడం జరిగింది. వేరుశనగలో రైతులకు కొత్త ఈ విత్తన రకాలు వాటి ప్రాముఖ్యత, నులిపురుగుల నివారణకు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరేడు గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్ వంశీకృష్ణ, జి మానస, ప్రియదర్శిని, రైతులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

## ఐసిఆర్‌పిలు

(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 7)

ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చులతో అధిక దిగుబడులు సాధించవచ్చని సోమవారం నాయుడుపేట మండల పరిధిలో ఉన్న ఐసిఆర్పీలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐ.సి.ఆర్.పిలు మాట్లాడుతూ ఘనజామృతం, ద్రవజామృతం, జీవామృతం, పలు రకాల కషాయాలతో ప్రకృతి వ్యవసాయం ద్వారా అన్ని రకాల కూరగాయలను పండిస్తున్నామని తెలిపారు. సోమవారం నాయుడుపేట స్త్రీ శక్తి భవన కార్యాలయ ఆవరణలో పలు రకాల కూరగాయల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి విక్రయించారు. బయట మార్కెట్లో కంటే తక్కువ ధరకే కూరగాయలను విక్రయిస్తున్నామని తెలిపారు. నాయుడుపేట మండల పరిధిలో ఉన్న పలు గ్రామాల రైతులకు ప్రక ృతి వ్యవసాయం పై అవగాహన కల్పించడంతో రైతులు ప్రకృతి వ్యవసాయం పై మక్కువ చూపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఉమా దేవి, ఏసి రేణుక, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సుకుమార్, కిరణ్, విజయ్, హైమావతి, సుమలత, సుమతి, బుజ్జమ్మ, శిరీష, మాధవి, గురునాథం, లక్ష్మీ ప్రసన్న, వెంకటేశ్వర్లు, అంజమ్మ, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.




# అర్జీల పరిష్కారం పై ప్రభుత్వం నిశితంగా గమనిస్తుంది

## జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 7)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం పై రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తుందని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల నుండి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న దృష్ట్యా అధికారులు ఆ దిశగా పరిష్కారానికి క ృషి చేయాలన్నారు. ముఖ్యంగా రీఓపెన్ అవుతున్నటువంటి కేసులలో రెవిన్యూ అధికారులు అత్యంత జాగ్రత్తగా పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం చూపకుండానే ఆయా అర్జీలను మూసి వేయకూడదన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాని సందర్భాలలో ఆయా అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీల పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి మానవీయ కోణంలో ఆలోచించి సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించాలన్నారు. కాగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 264 అర్జీలు అందాయి. ఇందులో ఎక్కువగా రెవెన్యూకు సంబంధించి 126 అర్జీలు, మున్సిపల్ శాఖకు సంబంధించి 39 , పంచాయతీ రాజ్ కు 21, పోలీసు శాఖ కు సంబంధించి 19 అర్జీలు, సర్వే కు 15 అర్జీలు వున్నాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ లవన్న, జడ్పీ ఇంచార్జి సీఈవో మోహన్‌రావు , జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి , డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు కుమారి, డ్వామా పిడి గంగా భవాని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డిఇవో రామారావు, డిటిసి చందర్, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సమగ్ర శిక్ష ఏపీవో ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.





# యుద్ధం వద్దు... శాంతి ముద్దు

### గాజా పై ఇజ్రాయిల్ దమనకాండ ఆపాలి
### అమెరికా, భారత్‌లు పాలస్తీనా యుద్ధం పై తమ ద్వంద్వ వైఖరి విడనాడాలి
### దేశ ప్రజలు పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలి
### ధర్నాలో వామపక్ష పార్టీలు పిలుపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 7)




యుద్ధం వల్ల నష్టాలే తప్ప ఎటువంటి ఉపయోగం ఉండదని, శాంతి మార్గంతో ప్రపంచం ఆనందంగా వర్ధిల్లుతుందని వామపక్ష పార్టీలు హితవు పలికారు. వామపక్ష పార్టీల పిలుపుమేరకు దేశవ్యాపిత నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గాజా పై ఇజ్రాయిల్ దాడులను వెంటనే నిలపాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ గాజా పై ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించి ఏడాది నుండుతుందన్నారు. అమెరికా ప్రోత్బలంతోనే ఇజ్రాయిల్ ఈ దాడులకు పాల్పడుతుందన్నారు. ఈ దాడులలో దాదాపు 50 వేల మందికి పైగా సామాన్య ప్రజలు, మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు మృతి చెందారన్నారు. గాజా పై దాడులను ఇజ్రాయిల్ వెంటనే ఆపాలని ఐక్యరాజ్యసమితి చెప్పిన పెడచెవిన పెడుతున్నారన్నారు. ఈ విషయంలో అమెరికా ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందన్నారు.




గతంలో అలిన ఉద్యమానికి భారతదేశం నాయకత్వం వహించింది అన్నారు. నేడు మోడీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆయుధాలు, డ్రోన్లు సరఫరా చేయటం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. యుద్ధం అనేక అనర్ధాలకు దారితీస్తుందని పలువురు మేధావులు చెప్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఈపాటికే యుద్ధంలో నివాస ప్రాంతాలు, విద్యాలయాలు, ధ్వంసం అయ్యాయి అని అన్నారు. సామ్రాజ్యవాద కాంక్షతో అమెరికా ప్రేరిత యుద్ధం నేడు ఇజ్రాయిల్ పాల్పడుతుందన్నారు. పశ్చిమాసియా దేశాల ప్రజలు నేడు భయానికా పరిస్థితులలో జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇజ్రాయిల్ తమ యుద్ధాన్ని ఆపాలన్నారు. భారతదేశ ప్రజలు పాలిస్తినా కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ గాజా పై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం తన ద్వంద వైఖరిని విడనాడి పాలిస్తినా ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు కే వీరారెడ్డి, ఆర్ రామక ృష?, ఎం విజయ, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి ప్రకాశరావు, శ్రీరామ్ శ్రీను, సిపిఎం రాష్ట్ర నాయకులు జాల అంజయ్య, జిల్లా నాయకులు జివి కొండారెడ్డి, ఎస్.కె మాబు, చీకటి శ్రీనివాసరావు, ఎం రమేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల పోరాటానికి ధర్నా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోర్ 7)

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుక చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. చత్తీస్ గడ్ దండకారణ్య అటవి ప్రాంతాల్లో ఈ సంవత్సరం జనవరి 1 నుండి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ ప్రాంతాలలో భారత సైన్యాన్ని, సి. ఆర్ పి ఎఫ్, డి ఆర్ జి, ఎస్ టి ఎఫ్, కేంద్ర సైనిక బలగాలతో ఆపరేషన్ కగార్ ప్రారంభించింది. రోజుకి పదుల సంఖ్యలో ఆదివాసీలను, మావోయిస్టులను బూటకపు ఎన్ కౌంటర్ లలో కాల్చి చంపుతున్నారు. అడవుల్లోని ఖనిజ సంపాదను దోచుకొనే కార్పొరేట్ కంపెనీలతో మైనింగ్ ఒప్పందాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అటవీ చట్టాలను సవరించింది. అటవీ ప్రాంతాల్లో జీవిస్తున్న ఆదివాసీలు అడవుల విధ్వంసాన్ని, కార్పొరేట్ కంపెనీల మైనింగ్ కార్యకలాపాలను విప్లవ పార్టీ సహాయంతో అడ్డుకుంటున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ప్రారంభింది. దండకారణ్యం జరుగుతున్న ఈ మారణహోమాన్ని బయట ప్రపంచానికి తెలియకుండా అటవీ ప్రాంతాల్లో పర్యటించడానికి వెళ్తున్న మేధావులను, పౌర హక్కుల సంఘాలను వివిధ రాజకీయ పార్టీలు అడ్డుకుంటున్నాయి. అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నాయి. కార్పొరేటర్లకు అనుకూలమైన ఆపరేషన్ కగార్ ను




వెంటనే రద్దు చేయాలి. ఇప్పటివరకు జరిగిన ఆదివాసీల హత్యాకాండ పై న్యాయ విచారణ జరిపించాలి. దండకారణ్యంలో ప్రాంతాల్లో ఉన్న పారా మిలిటరీ బలగాలను వెనుకకు రప్పించాలి, ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న మిలటరీ క్యాంపులను ఎత్తివేయాలి, అటవీ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చావలి సుధాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ నారాయణ, సిపిఐ ఎంఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మోహన్, బీసీ ఫెడరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, ఏరుకు హక్కుల పోరాట సమితి నాయకులు మోహన్ కుమార్ ధర్మ, సుందరం, మాచర్ల మోహన్ రావు , విరసం సీనియర్ నాయకులు కళ్యాణ్ రావు, నరసింహారావు, వెంకటేష్, అంజమ్మ, సుబ్బారావు, కోటి, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాల్టీ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 7)



అద్దంకి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, మంచి నీటి సరఫరా, రహదారులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి పెట్టాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులకు సూచించారు. పట్టణ వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా శుభ్రం చేయాలని తెలిపారు. పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టిసారించాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. పట్టణంలో రోడ్ల మరమ్మత్తుల, వీధిలైట్లను అమర్చడం లాంటి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలి ఆదేశించారు. గత ప్రభుత్వం ప్రజలు, వ్యాపారుల నుంచి చెత్త పన్నును వసూలు చేసిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విమర్శించారు. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్తపన్నును రద్దు చేసిందని మంత్రి తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గతంలో తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుని వస్తే జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి ఊసే లేకుండా చేసినట్లు పేర్కొన్నారు. అధికారులతో సమీక్ష అనంతరం అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినతిపత్రాలు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యల సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కృషి చేయాలని పేర్కొన్నారు. అద్దంకి ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ప్రజలకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పట్టణ ప్రజలు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 53 శాతంగా ఉన్న బీసీల్లారా

## 2029 నాటికి మనమే రాజ్యాధికారంలోకి రావాలి రామచంద్ర యాదవ్ నాయకత్వంలో పనిచేద్దాం

## రాష్ట్ర జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 7)



53 శాతానికి పైగా ఉన్న బీసీ కులాలు రాజ్యాధికారంలోకి ఎందుకు రాలేకపోతున్నారు తెలుగు రాష్ట్రాలలోని బిసి సంఘ నాయకుల్లారా బిసి ఉద్యమకారులారా బీసీ ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్న 53 శాతం ఉన్నటువంటి బీసీలు రాజ్యాధికారం సాధించడంలో ఎందుకు ఎనుకబడిపోయాం. ఇది గమనించిన బోడె రామచంద్ర యాదవ్ భారత చైతన్య యువజన పార్టీ స్థాపించి మన ముందుకు వచ్చారు. మనం ఏం చేద్దాం. బహుజనులు ఈ రాష్ట్రాన్ని పాలించాలంటే రామచంద్ర యాదవ్ అడుగుజాడల్లో నడవాలి అంతే గాని వివిధ రాజకీయ పార్టీలలో వాళ్లు ఇచ్చే అరకొర పదవులకు ఆశపడి చైతన్యమైనటువంటి సంఘ నాయకులు, ఉద్యమకారులు అందరం బానిసలమైపోయాం. నేడు మన రాష్ట్రంలో మూడు నాలుగు శాతంగా ఉన్నటువంటి కులాలు ఒకరి తరువాత ఒకరు మనలను పాలిస్తూ సకల సంపదను దోచుకుతింటున్నారు. ఆ కులాలు పూర్తిస్థాయిలో ఆర్థికంగా, సాంఘికంగా అన్ని విధాల అభివృద్ధి చెందారు. దానికి కారణం రాజ్యాధికారం వాళ్ల చేతుల్లో ఉండటమే. అందుకనే బీసీలుగా మనం మన స్వార్థాన్ని పక్కనపెట్టి నిజమైనటువంటి బీసీ ఉద్యమకారులుగా తయారై భారత చైతన్య యువజన పార్టీని బలోపేతం చేసుకుందాం, రాజ్యాన్ని పాలిద్దాం అని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో బీసీల మేధో మదనం సదస్సులు ఏర్పాటు చేసి రానున్న ఎన్నికల నాటికి బీసీలను చైతన్య పరుద్దామని శ్రీనివాసులు తెలిపారు. నా కులం... నాకు ఏమిచ్చింది అనేది కాకుండా నేను నా కులానికి ఏమి చేశాను అని ఆలోచిద్దాం. అదే విధంగా ఆర్థికంగా పూర్తిస్థాయిలో స్థిరపడినటువంటి వివిధ పార్టీలలో వివిధ పదవులలో కొనసాగుతున్న బిసి రాజకీయ నాయకులను మన పార్టీలోకి ఆహ్వానిద్దాం. అలా రాని వారి పట్ల కఠినంగా వ్యవహరిద్దాం. మేదోమదన సదస్సులో మనం పూర్తిగా ప్రక్షాళన చెందుదాం. బీసీ జాతులకు రాజ్యాధికారం సాధించే వరకు నిరంతరం పోరాడుదాం అని శ్రీనివాసులు తెలిపారు. రామచంద్ర యాదవ్ మంచి ఆలోచనతో రాజకీయ పార్టీని స్థాపించారు. ఆయన ఆలోచనకు మనము చేయూతనిద్దాం అని అన్నారు.

# ఉద్యమాలను బలోపేతం చేయడం పై చర్చ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 7)



దక్షిణాది రాష్ట్రాల్లో రైతు, కూలీ ఉద్యమాలను ఎలా బలోపేతం చేయాలనే అంశంపై చర్చించడానికి బెంగుళూరులో గాంధీభవన్లో సోమ, మంగళవారాల్లో సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వ సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ వడ్డె శోభనాద్రీశ్వరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపులు అన్నింటిని రాష్ట్రంలో రైతులను భాగస్వాములు చేసి అమలు చేశామని వివరించారు. సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో ఉద్యమం కావడానికి కొన్ని సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత రైతులని ప్రధానంగా ఉద్యమంలో భాగస్వాములు చేయాలన్నారు. దాని కోసం నాయకత్వం గ్రామాల్లో కేంద్రీకరించాలని సూచించారు. ఈ సమావేశాల్లో అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు వి మాధవరావు, ఏకేఎస్ జాతీయ నాయకులు రావుల వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్




(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 7)

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన 200 అర్జీలను నిర్దేశించిన గడువులోగా అర్థవంతంగా పరిష్కారం చూపాలని, అలసత్వం వహించరాదని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, దేవేంద్ర రెడ్డి, రామ్మోహన్ లతో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు రెవెన్యూ శాఖ 136, పంచాయతీరాజ్ శాఖ 7, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ 1, వైద్య ఆరోగ్యశాఖ 3, పోలీస్ శాఖ 8, సెర్ప్ 10, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 8, స్కిల్ డెవలప్మెంట్ 4, స్కూల్ ఎడ్యుకేషన్ 1, వికలాంగులు వయో వృద్దులు శాఖ 2, ఎంఏయూడి 6, ఎస్సి కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ 1, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 1, డ్వామా 2, ఐసిడిఎస్ 2, సమగ్రశిక్ష అభియాన్ 2, హౌసింగ్ 2, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ 1, సోషల్ వెల్ఫేర్ 2, అటవీశాఖ 1 వెరసి మొత్తం 200 వినతులు వచ్చాయన్నారు. అధికారులందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు.

# సర్వేపల్లి తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 7)

ముత్తుకూరు మండలం దొరువులపాళెం మాజీ సర్పంచ్ ఇసనాక చంద్రశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం 200 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దొరువులపాళెంలో నిర్వహించిన భారీ కార్యక్రమంలో అందరికీ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



# ఎంపీడీవో సురేష్ బాబును సన్మానించిన విన్నమాల సచివాలయ సిబ్బంది





(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 7)

నాయుడుపేట మండలం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సురేష్ బాబును విన్నమాల సచివాలయ సిబ్బంది పరమ శివయ్య, సందీప్, సాయి కుమార్, జ్యోతి, మండలంలోని డిజిటల్ అసిస్టెంట్‌లు (గ్రేడ్ 6పంచాయతీ కార్యదర్శులు) మహాయోగి, సాయి కుమార్, ప్రసాద్, ముని శేఖర్, లోకేష్, శ్రీకాంత్, సునైనా, శివశంకర్, శివానిలు సోమవారం ఎంపీడీవో కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకి శుభాకాంక్షలు తెలియజేశారు. సాధారణ బదిలీలో భాగంగా ఎంపీడీవో సురేష్ బాబు పెళ్ళకూరు నుండి నాయుడుపేటకు బదిలీ అయ్యారు.

# భాధితులకు సత్వర న్యాయం అందిచడమే ధ్యేయం

## ఎఎస్పీ కె నాగేశ్వరరావు

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 54 ఫిర్యాదులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 7)

బాధితులకు సత్వర న్యాయం అందించడమే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తుందని ఎఎస్పీ కె నాగేశ్వరరావు అన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుటకు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన పిర్యాదుదారులతో పోలీస్ అధికారులు ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకుని ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఆయా ఫిర్యాదులపై పోలీస్ అధికారులు సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి భాదితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు,జాబ్ మోసాలు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని... ఔట్సోర్సింగ్ ద్వారా మెడికల్ టెక్నీషియన్ గా పనిచేస్తున్న తనకి గవర్నమెంట్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి రూ.15 లక్షల రూపాయలు తీసుకొని జాబు ఇప్పించకపోగా కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దోర్నాల మండలంకు చెందిన బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సీఐ కె అజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ వై పాండురంగారావు, ప్యానెల్ అడ్వొకేట్ బివి శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు రజియా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేసిన మంత్రి గొట్టిపాటి





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 7)

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనను మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనంతరం మాట్లాడుతూ శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హిమవర్ధిని దేవిగా దర్శనమిస్తున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు చెడును నాశనం చేసి గ్రహ పీడలు తొలగించే ఆ హిమవర్ధినిదేవి అనుగ్రహం, ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని, రాష్ట్రంలో పాడిపంటలు సంవృద్ధిగా పండాలని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, స్థానిక తెదేపా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన వినతులపై తక్షణ చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 7)

జిల్లాలో ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన వినతులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని శంకరన్ హాల్‌లో ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన వినతులపై తీసుకున్న చర్యలు గురించి జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన అర్జీలను మూడు నెలల్లోగా పరిష్కరించాలన్నారు. ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన అర్జీలు అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు చేయ దగ్గ పనులను వెంటనే చేపట్టాలన్నారు. చేయలేని పనులపై స్పష్టమైన వివరాలతో తెలియజేయాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. లవన్న, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లాఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి , మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## కత్తులతో దాడి చేసిన కేసులో నిందితులు అరెస్టు

### ఒకటో పట్టణ సీఐ శేఖర్ బాబు




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 7)

ఆంజనేయ స్వామి జెండా పండుగ రోజు ఇద్దరు వ్యక్తుల పై కత్తులతో దాడి చేసిన సంఘటనలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు గూడూరులోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ శేఖర్ బాబు వివరాలు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీన ఆంజనేయ స్వామి జెండా పండుగ రోజున పట్టణంలో కత్తులతో దాడి సంఘటన చోటు చేసుకుంది. జెండా పండుగ గ్రామోత్సవంలో పాల్గొన్న అబ్దుల్లా రెహమాన్ అనే యువకుడిపై పెద్ద మసీదు ప్రాంతంలో డాన్స్ వేసే విషయంలో రాగిపాటి శ్రీనాద్, పట్టణానికి చెందిన మరో యువకుడు గొడవపడ్డారు. ఈ క్రమంలో శ్రీనాద్ కత్తితో అబ్దుల్లా రెహమాన్ పై దాడి చేసి పారిపోయాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనాథ్‌ను తాళమ్మ దేవాలయం సమీపంలో పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. అదే విధంగా చిన్న మసీదు ప్రాంతంలో హరీష్,యశ్వంత్ అనే ఇద్దరు యువకులు జెండా వేడుకల్లో పాల్గొనగా పట్టణానికి చెందిన మనోజ్ అనే యువకుడు, వెంకటేశ్వర్లు అనే మైనర్‌లు గొడవ పడ్డారు. మనోజ్, వెంకటేశ్వర్లు, హరీష్, యశ్వంత్‌ల పై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు రెండు కేసుల్లో నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని సీఐ శేఖర్ బాబు తెలిపారు.

## బాణాసంచా గోడౌన్‌లు తనిఖీ



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 7)

పట్టణంలోని బాణాసంచా గోడౌన్లను సోమవారం డిఎస్పి నాగరాజు, సీఐ సుబ్బారావులు తనిఖీ చేశారు. దీపావళి సమీపిస్తున్న వేళ యజమానులకు పలు సూచనలు చేశారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని షాప్ యజమానులకు సూచించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

## బూచేపల్లికి శుభాకాంక్షలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 7)

ఒంగోలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో వివిధ గ్రామాల నుండి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి పూలమాలలు, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.






## టీడీపీలో చేరిన వైసీపీ నేత




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 7)

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో సోమవారం 31వ డివిజన్ శ్రీలంక కాలనీకి చెందిన వైసీపీ నేత మాణిక్యం సతీష్ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సతీష్ వెంట వారి మిత్ర బృందం ఉన్నారు.

# పాల కంటే 8 రెట్లు ఎక్కువ పవర్.. ఈ సూపర్ ఫుడ్ ప్రతి ఒక్కరూ తినాల్సిందే..









ఆరోగ్యమే మహాభాగ్యం ఉంటారు. ప్రస్తుత బిజీ లైఫ్ స్టైల్‌లో ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. ఆరోగ్యంగా లేకపోతే ఆర్థికంగా, శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇక, ధృఢమైన శరీరం కోసం కాల్షియం ఎంతో అవసరం. మనలో చాలా మంది కాల్షియం, ప్రోటీన్ కోసం పాలు తాగుతాం. ప్రతి తల్లి కూడా తమ పిల్లలు ఆరోగ్యంగా ఉండటం కోసం.. ఎముకల బలం కోసం ఆవు లేదా గేదె పాలు తాగిస్తారు. అయితే, పాలు కంటే ఎక్కువ కాల్షియం ఉన్న ఒక సూపర్ ఫుడ్ ఉంది. ఈ అద్భుత ఆహారం ఎముకల్ని చాలా బలంగా మారుస్తుంది. ఇంతకీ ఆ సూపర్ ఫుడ్ ఏంటి అనుకుంటున్నారా..? పోషకాల గని అయిన నువ్వులు గురించి మనం చెప్పుకుంటున్నాం. అవును మీరు వింటున్నది నిజమే.. ఈ చిన్న విత్తనాల్లో ఒక గ్లాస్ పాల కంటే 8 రెట్లు కాల్షియం ఎక్కువగా ఉంది. కాల్షియం మాత్రమే కాదు..నువ్వుల్లో ప్రోటీన్, ఫైబర్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, మెగ్నీషియం, ఐరన్, జింక్స్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

నువ్వుల్లో పాల కంటే ఎక్కువ కాల్షియం ఉంటుంది. 100 గ్రాముల నువ్వుల్లో దాదాపు 975 మి.గ్రా కాల్షియం ఉంటుంది. అయితే 100 మి.లీ పాలలో 120-130 మి.గ్రా కాల్షియం మాత్రమే ఉంటుంది. చాలా మందికి లాక్టోస్‌ను జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. కాబట్టి ఇలాంటి వారు పాలు తీసుకోలేరు. ఇలాంటి పరిస్థితుల్లో నువ్వులు వారికి ఓ వరంలా కనిపిస్తుంది. ఎందుకంటే నువ్వుల్లో పాల కంటే 1 లేదా 2 కాదు 8 రెట్లు ఎక్కువ కాల్షియం ఉంది. అంతేకాకుండా నువ్వులు సెసామోలిన్, సెసామిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లకు మూలం. ఇవి మీ ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయి. మీరు మీ ఎముకలను బలోపేతం చేయాలనుకుంటే.. భవిష్యత్తులో సప్లిమెంట్లను తీసుకోకూడదనుకుంటే, మీరు తప్పనిసరిగా ఆహారంలో నువ్వుల్ని చేర్చుకోవాలి. ఇక, నువ్వులు తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం.

**నువ్వులతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు..కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గిస్తాయి..**

నువ్వులు.. కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించడంలో ముందుంటాయి. అధిక కొలెస్ట్రాల్, ట్రైగ్లెజరిడ్‌తో బాధపడేవాళ్లు.. మీ ఆహారంలో నువ్వులు భాగం చేసుకుంటే సరిపోతుంది. మీరు హార్ట్ పేషెంట్ అయితే.. నువ్వులు తీసుకోవడం చాలా లాభం. ఎందుకంటే నువ్వులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గిస్తాయి. దీంతో, గుండె జబ్బులు.. స్ట్రోక్ వంటి ముప్పు నుంచి మీరు తప్పించుకోవచ్చు. నువ్వుల్లో మన శరీరానికి కావాల్సిన మంచి కొవ్వులు, మోనో అన్‌శాచ్యురేటెట్ కొవ్వులు ఉంటాయి. అంతేకాకుండా లిగ్నన్స్, ఫైటోస్టెరాయిన్ వంటి సమ్మేళనాలు కూడా నువ్వుల్లో లభిస్తాయి. ఈ రెండూ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. రోజూ 40 గ్రాముల నువ్వుల్ని తింటే.. చెడు కొలెస్ట్రాల్ 10 శాతం తగ్గుతుందని నిపుణులు తెలిపారు.

**పీరియడ్స్ సమయంలో మంచి బూస్టర్..**పీరియడ్స్‌కు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటున్న మహిళలకు నువ్వులు సూపర్ ఫుడ్. నువ్వులలో ఫైటోఐసోజెన్లు ఉంటాయి. ఇది క్రమరహిత ఋతుస్రావం సమస్యను నయం చేయడంలో మహిళలకు సహాయపడుతుంది. అంతేకాకుండా నువ్వులు తీసుకోవడం పీరియడ్స్ నొప్పులు తగ్గే అవకాశం ఉంది. ఈ సమయంలో.. మహిళలు తమ ఎముకలను బలోపేతం చేయడానికి నువ్వులను తప్పనిసరిగా తీసుకోవాలి. మెనోపాజ్ దశలో ఈస్ట్రోజెన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఈ సమయంలో మహిళలు చాలా సమస్యలు ఎదుర్కొంటారు. నువ్వులు తీసుకోవడం వల్ల వీటిని పరిష్కరించవచ్చు.

**మోకాలి నొప్పులకు నువ్వులు..**ఈ రోజుల్లో ఆస్టియోఆర్థరైటిస్ సర్వసాధారణంగా వచ్చే జాయింట్ పెయిన్. దీని వల్ల చాలా మంది మోకాలి నొప్పులతో బాధపడుతున్నారు. శరీరంలో మంట, ఆక్సిడేటివ్ వల్ల మృదులాస్థి కీళ్లు దెబ్బతింటాయి. నువ్వులు సెసామోలిన్, సెసామిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లకు మూలం. ఈ యాంటీ ఆక్సెడెంట్లు శరీరంలో వేడితో పాటు మంటను తగ్గిస్తాయి. రోజూ 40 గ్రాముల నువ్వులు తీసుకుంటే కీళ్ల నొప్పులు తగ్గే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**ఎముకలు సూపర్ స్ట్రాంగ్..**

# ఈ బెనిఫిట్స్ తెలిస్తే బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ మాత్రమే తింటారు



కొందరికీ ఫేవరేట్ బ్రేక్‌ఫాస్ట్ ఐటెమ్స్‌లో ఇడ్లీ ఉంటుంది. ఇడ్లీలు తినడం వల్ల మన టేస్టింగ్ బడ్స్ మాత్రమే సాటిస్‌ఫై అవ్వవు. దీని వల్ల చాలా లాభాలు కూడా ఉంటాయి. ఇడ్లీలు తింటే బరువు కంట్రోల్ చేసుకోవచ్చు. జీర్ణ సమస్యలు రావు. ఈ కారణంగా చాలా మంది ఫేవరేట్ బ్రేక్‌ఫాస్ట్ ఐటెమ్స్‌లో ఇడ్లీలు ఉంటాయి. ఇవి ఎంత హెల్దీ అంటే.. ఏదైనా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న, జ్వరం వచ్చిన వారికి కూడా ఇవి బెస్ట్ బ్రేక్‌ఫాస్ట్ ఐటెమ్. మరి వీటిని తినడం వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.

**ఈజీగా జీర్ణమవ్వడం..**

ఇడ్లీ పిండిని మనం ఎక్కువగా పులియబెడతాం. దీని వల్ల ఇడ్లీలు మనకి ఈజీగా జీర్ణమవుతాయి. ఇవి మన గట్ హెల్త్‌కి కూడా చాలా మంచివి. ఎలాంటి జీర్ణ సమస్యలు రావు.

**రవ్వ ఇడ్లీ ఎలా తయారుచేయాలి??**

**కేలరీలు తక్కువ.. ఫైబర్ ఎక్కువ..**

మిగతా బ్రేక్‌ఫాస్ట్ ఐటెమ్స్‌తో పోలిస్తే ఇడ్లీలలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ కంటెంట్ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. అంతేకాకుండా బరువు తగ్గించడంలో కూడా హెల్ప్ అవుతాయి. అందుకే, వీటిని రెగ్యులర్‌గా తినడం మంచిది.

**పోషకాలు..**

ఇడ్లీల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల చాలా వరకూ కడుపు నిండుగా ఉంటుంది. త్వరగా ఆకలి అవ్వదు. అదే విధంగా వీటిలో మినపప్పు కలుస్తుంది. దీని వల్ల ఐరన్ మనకి అందుతుంది. ఇందులో ఫ్యాట్ లెవల్స్ తక్కువగా ఉంటాయి. కాబట్టి, హ్యాపీగా వీటిని తినొచ్చు.

మనం ఎలా అయినా తయారు చేయొచ్చు..

సాధారణంగా మనం ఇడ్లీలను రవ్వ, మినపప్పుతో చేస్తాం. వీటిని ఇంకా హెల్దీగా చేసుకోవాలంటే ఇందులో వెజిటేబుల్స్ యాడ్ చేయొచ్చు. లేదా హోల్ గ్రెయిన్స్, మిల్లెట్స్‌తో ఇడ్లీలు చేయొచ్చు. దీని వల్ల బాడీకి ఎక్స్‌ట్రా పోషకాలు అందుతాయి. ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

**ఎవరైనా తినొచ్చు..**

ఇడ్లీలు తినడానికి మెత్తగా ఉంటాయి. కాబట్టి, ఏ వయసు వారైనా తినొచ్చు. పుట్టిన పిల్లలకి మొదటిసారి సాలిడ్ ఫుడ్స్ ఇవ్వాలన్నా ఇడ్లీలు ఇవ్వొచ్చు. పళ్ళు ఊడిపోయిన పెద్దలు కూడా వీటిని ఈజీగా తినొచ్చు. కాబట్టి, హ్యాపీగా వీటిని ప్రిఫర్ చేయొచ్చు. అయితే, మంచివి కదా అని ఎక్కువగా తినకూడదు. మోతాదులోనే తినాలని గుర్తుపెట్టుకోండి.

# 'తులసి'తో అందంగా



మచ్చలేని సౌందర్యాన్ని సొంతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులే కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉండే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి.

మచ్చలేని సౌందర్యాన్ని సొంతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులే కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉండే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి.



మొటిమలకు.. తాజా తులసి ఆకులను తినడం వల్ల మొటిమలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. తాజా ఆకులను మెత్తగా చేసుకొని మొటిమలపై రాసినా ఫలితం ఉంటుంది. తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్‌గా కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు.. ముఖం కాంతివంతంగా మారుతుంది. తులసి పొడిని రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మ రంధ్రాలు తెరుచుకొని మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. తులసి ఆకుల రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముఖానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమనం కలుగుతుంది.

**నల్లమచ్చలుంటే..!**

ముఖంపై నల్ల మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకోసారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్లమచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది.

# పచ్చడి తింటే యూరిక్ యాసిడ్ తగ్గుతుంది.. చేసుకోవడం చాలా ఈజీ..



ఈ రోజుల్లో మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయితే, చాలా మందిలో యూరిక్ యాసిడ్ సమస్య చాలా ఎక్కువగా కనిపిస్తుంది. ఆహారం, డ్రింక్స్‌లో ఉండే ప్యూరిన్స్ అనే రసాయనాల్ని శరీరం విచ్ఛిన్నం చేసినప్పుడు యూరిక్ యాసిడ్ అనే వ్యర్థ పదార్థం ఏర్పడుతుంది. ఉరుకుల పరుగుల జీవితం, ఎలా పడితే అలా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం ఇవన్నీ రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచుతున్నాయి. యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల శరీరంలో అనేక రకాల సమస్యలు వస్తాయి. ఈ వ్యాధి ప్రధాన లక్షణాల్లో కీళ్ల నొప్పులు ఒకటి.

శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగితే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగితే తరుచుగా మూత్రవిసర్జనకు దారితీయొచ్చు. అంతేకాకుండా యూటీఐ లేదా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ ఉండవచ్చు. దీంతో.. మూత్ర విసర్జన చేసేటప్పుడు మంట వస్తుంది. ఇంకా వీపు కింద, పొట్ట దిగువ భాగం, గజ్జల్లో నొప్పి కలుగుతుంది. బరువు అధికంగా ఉన్నవారిలో యూరిక్ యాసిడ్ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇక, చాలా మంది యూరిక్ యాసిడ్‌ను తగ్గించేందుకు డాక్టర్లను సంప్రదించి ఏవేవో మందులు వాడుతున్నారు. అయితే, కొన్ని రకాల ఫుడ్స్ కూడా తిని సహజంగా యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గించుకోవచ్చు. ఇవాళ, ఓ పచ్చడిని మీ ముందుకు తీసుకువస్తున్నాం. ఈ పచ్చడి తింటే యూరిక్ యాసిడ్ తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఆ పచ్చడి ఏంటి..? ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం.

**యూరిక్ యాసిడ్ కోసం పచ్చడి..**

చట్నీ లేదా పచ్చడి భారతీయ ఆహారంలో ముఖ్యమైన భాగం. మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ ఏదైనా సరే పచ్చడి ఉండాల్సిందే. అయితే, భారతదేశంలో చాలా రకాల చట్నీలు ఉన్నాయి. స్వీట్ చట్నీ నుంచి ఉప్పు చట్నీ వరకు. అదే పచ్చడి ఆహారపు రుచిని పెంచడమే కాకుండా శరీరానికి అనేక ప్రయోజనాలను అందించడంలో కూడా సహాయపడుతుందని మీకు తెలుసా. యూరిక్ యాసిడ్ నియంత్రించేందుకు ఓ చట్నీని తయారుచేసుకుందాం. అందుకు కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.

**కావాల్సిన పదార్థాలు.. కొత్తిమీర తరుగు,పుదీనా ఆకులు, పచ్చి మిరపకాయలు - ఐదు నుంచి ఆరు, అల్లం, ఉప్పు - రుచికి తగినంత, ఎలా తయారు చేసుకోవాలి..**

ఈ పచ్చడిని తయారు చేయడానికి మీరు ముందుగా కొత్తిమీర, పుదీనా ఆకులను బాగా కడగాలి. తర్వాత అల్లం, పచ్చిమిర్చి, ఆకులను మిక్సీ గ్రైండర్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. చట్నీ రెడీ అయ్యాక రుచికి సరిపడా ఉప్పు వేసి మరోసారి గ్రైండ్ చేసుకోండి. గ్రైండర్ బదులు రోలు కూడా ఉపయోగించవచ్చు. రోలు ఉపయోగించి చేస్తే మంచి రుచి కూడా ఉంటుంది. ఇంకేముంది చట్నీ తినడానికి రెడీ అయిపోయింది. ఈ పచ్చడిని దోసె, ఇడ్లీ, అన్నంలో కలిపి తీసుకోవచ్చు.

**కొత్తిమీరతో లాభాలు..**కొత్తిమీరలో ఎన్నో వ్యాధుల్ని తగ్గించే ఔషధ గుణాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ వంటల్లో కొత్తిమీరను వాడతారు. కూరల్లో కొత్తిమీర వేస్తే రుచే వేరు. కొత్తిమీరలో ఎన్నో విటమిన్లు, పోషకాలు ఉన్నాయి. విటమన్లు ఎ, సి, బి, కె, కాల్షియం, ఫాస్ఫరస్, సోడియం, మెగ్నీషియం వంటి అనేక రకాల పోషకాలకు కొత్తిమీర నిలయం. ఇవన్నీ రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణం కొత్తిమీరకు ఉంది. కొత్తిమీర యాంటీ యాక్సిడెంట్లు ఉన్నాయి. రోజూ కొత్తిమీర తీసుకుంటే డయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటుంది. రోజూ తింటే శరీర వాపులు తగ్గుతాయి.

**పుదీనా ఏం తక్కువ కాదు..**పుదీనా ఆకుల్లో ఎన్నో విటమన్లు, పోషకాలు ఉన్నాయి. పుదీనా ఆకులు మంచి ఫ్లేవర్ కలిగి ఉండటంతో పాటు సువాసనను వెదజల్లుతాయి. వీటి వాసన చూస్తే మీ మూడ్ మంచిగా రిఫ్రెష్ అవుతుంది. పుదీనా ఆకుల రసంతో పాటు జీలకర్ర, శొంఠి పొడి మిశ్రమాన్ని కలిపి తీసుకుంటే ఆకలి పెరుగుతుంది. పుదీనా ఆకులు వాసన చూడటం వల్ల అలెర్జీ లక్షణాలు తగ్గుతాయి. పుదీనాను పచ్చళ్లు, టీల్లో వాడతారు. మింట్ ఆకుల్ని తినడం వల్ల మీ చెడు శ్వాసకు చెక్ పడుతుంది. మీ నోటి శ్వాస ఎప్పుడూ తాజాగా ఉంటుంది. పుదీనాలో సల్ఫర్ ఉంటుంది. ఈ మూలకం ఊపిరితిత్తుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

**యూరిక్ యాసిడ్ ఎక్కువైతే..**యూరిస్ యాసిడ్ ఎక్కువ అవ్వడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల కిడ్నీలపై ఎక్కువ ప్రభావం పడుతుంది. రక్తంలో యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల దాదాపు 11 ఏళ్ల ఆయుష్షు తగ్గుతుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. యూరిక్ యాసిడ్ అధికంగా ఉన్నప్పుడు ఆల్కహాల్, కూల్ డ్రింక్స్, రెట్ మీట్, జంక్ ఫుడ్, ప్రాసెస్ ఫుడ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. మంచి వ్యాయామం, ఆహారం, అలవాట్లు యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com